నమస్తే తెలంగాణ
ములుగు జయశంకర్ భూపాలపల్లి
5 | వరంగల్, ఆదివారం 1 డిసెంబర్ 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY

కదిలారు.. గోడలు కట్టించారు!

- ఆర్ట్స్ కాలేజీ ప్రహరీకి మోక్షం

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 30 : యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో కూల్చిన ప్రహరీ గోడలకు మోక్షం లభించింది. ఎట్టకేలకు అధికారులు నిర్మాణ పనులు మొదలుపెట్టారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి సభ కోసం ఆర్ట్స్ కాలేజీ ప్రహరీ గోడలను నాలుగు వైపులా కూల్చివేయడంతో గ్రౌండ్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనంపై ఈ నెల 28న 'నమస్తే తెలంగాణ'లో 'కూల్చుడేనా.. కట్టేదెప్పుడు?' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన యూనివర్సిటీ అధికారులు శనివారం ప్రహరీ పనులు ప్రారంభించగా, స్థానికులు హర్షం వ్యక్తంచేశారు.

కూల్చిన చోట ప్రహరీ నిర్మిస్తున్న ఆర్ట్స్ కాలేజీ అధికారులు

ఇస్రో స్పేస్ ట్యూటర్‌గా శశాంక్ భూపతి

వరంగల్, నవంబర్ 30 : ఇస్రో స్పేస్ ట్యూటర్‌గా హనుమకొండ జిల్లాకు చెందిన శశాంక్ భూపతిని ఆ సంస్థ ఎంపిక చేసింది. ఈయన సీనియర్ న్యాయవాది శంకర్, శ్యామల దంపతుల కుమారుడు. జేఎన్‌టీయూలో ఆర్కిటెక్చర్ కోర్సు పూర్తి చేసి తెలంగాణ నుంచి ఇస్రో ట్యూటర్‌గా ఎంపికైన ఏకైక వ్యక్తి శశాంక్ భూపతి కావడం విశేషం. అర్కిటెక్చర్ విద్యను అంతరిక్షానికి అనుసంధానిస్తూ 2022లో ఏన్షియంట్ టెక్నాలజీస్ డిజైన్ రీసెర్చ్ ల్యాబ్ అనే కంపెనీని స్థాపించారు. అంతరిక్ష పరిశోధనపై విద్యార్థులకు అవగాహన పెంపొందించేందుకు నైపుణ్యం కలిగిన స్పేస్ ట్యూటర్ల నియామక బాధ్యతను దేశ ప్రధాని నరేంద్రమోదీ ఇస్రోకు అప్పగించారు. ఈ నేపథ్యంలో నగరానికి చెందిన శశాంక్ భూపతిని ఇస్రో ట్యూటర్‌గా ఎంపిక చేస్తూ సంస్థ ఉత్తర్వులు జారీ చేసింది.

ఇస్రో ట్యూటర్‌గా ఎంపికైన శశాంక్ భూపతి

- డైనింగ్ హాల్‌లోనే వ్యర్థాలు పడేస్తారా?
- మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి ఆగ్రహం
- మేమున్నాం.. అధైర్యపడొద్దని విద్యార్థులకు భరోసా
- కురవి 'ఏకలవ్య పాఠశాల' ఆకస్మిక సందర్శన
- సమస్యలపై కలెక్టర్ అద్వైత్‌కుమార్‌కు ఫిర్యాదు

విద్యార్థులతో కలిసి అల్పాహారం తింటున్న సత్యవతిరాథోడ్

కురవి: డైనింగ్ హాల్‌లో పడేసిన వ్యర్థపదార్థాలను చూసి ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

మీ పిల్లలకు ఇలాగే వండిపెడుతారా..

విద్యార్థులను మనుషుల్లా చూడరా?

కురవి, నవంబర్ 30 : 'పరిసరాలు ఇలాగేనా ఉండేది? ముళ్ల చెట్లు పెరిగినా.. మురుగు నీరు నిల్వ ఉన్నా పట్టించుకోరా? వంట గదులు ఇట్లనే ఉంటయా? మీ పిల్లలకు ఇలాగే వండి పెడతారా? డైనింగ్ హాల్‌లోనే వ్యర్థాలు పడేస్తే వాసనకు పిల్లలు ఎలా తింటారు? వారి ఆరోగ్యం బాగుంటుందా?' అంటూ మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎంఆర్ఎస్)ను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. పరిసరాలు, డైనింగ్ హాల్‌ను పరిశీలించి విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. డైనింగ్ హాల్‌లో రెండు రోజులుగా వ్యర్థాలను తొలగించక దుర్వాసన వస్తుండడాన్ని గుర్తించి సిబ్బందిపై మండిపడ్డారు. ప్రిన్సిపాల్ ప్రదీప్‌కర్థంను పిలిచి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'విద్యార్థులను కనీసం మనుషులుగా చూడకపోతే ఎలా? డైనింగ్ హాల్ ఇలా ఉంటే విద్యార్థులు భోజనమెలా చేస్తారు? వారి ఆరోగ్యం ఏమవుతుందో ఆలోచించారా?' అంటూ ప్రశ్నించారు. బియ్యం, కూరగాయలు ఎక్కడి నుంచి తీసుకొస్తున్నారని తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని, పాలు సమయానికి రావడం లేదని, ఉప్మా ఉండలుగా, రాగి జావా నీళ్లలాగా ఉందని, మీ పిల్లలకు ఇలాగే పెడతారా అని అడిగారు. డైనింగ్ హాల్ నుంచే ఆర్సీవోకు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయకపోవడంతో కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌కు ఫోన్‌లో గురుకులం సమస్యలను తెలిపారు. టాయిలెట్స్ సరిగా పనిచేయడం లేదని, పైపులు లీకేజ్ అవుతున్నాయని, 500 మందికిపైగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్కర్స్ సరిగా రావడంలేదని, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ ఈ ప్రాంతం వారు కాదని, రాష్ట్రం మొత్తం ఫుడ్‌పాయిజన్‌తో అల్లాడుతుందని, పట్టించుకోకపోతే అన్ని గురుకులాలు అలాగే తయారవుతాయన్నారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు రూ. 6 కోట్ల నిధులు కేటాయించానన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌తో కలిసి అల్పాహారం చేశారు. విద్యార్థులతో మాట్లాడుతూ 'మేమున్నాం.. అధైర్యపడొద్దు' అంటూ భరోసానిచ్చారు. ఇక్కడి సమస్యలు కలెక్టర్‌కు చెప్పానని, గురుకులాల ప్రిన్సిపల్ సెక్రటరీ, సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని సత్యవతి హామీ ఇచ్చారు.

తల్లిగా కోరుతున్నా.. సమస్యలు పరిష్కరించండి

'జిల్లాలోని ఎంపీ, ఎమ్మెల్యేలను ఓ తల్లిగా కోరుతున్నా.. బంగారు భవిష్యత్ ఉన్న చదువుకునే పిల్లలు పిట్టల్లా రాలిపోతున్నారు.. వారి సమస్యలు పట్టించుకొని పరిష్కరించండి' అంటూ సత్యవతి రాథోడ్ విజ్ఞప్తి చేశారు. చిన్న పిల్లలు చనిపోతుంటే మహిళా మంత్రులు రోజుకో తీరుగా మాట్లాడుతున్నారని, ఓ వైపు హైకోర్టు మొట్టికాయలు వేసినా కొండా సురేఖ తీరు మారడం లేదని మండిపడ్డారు. మంత్రులుగా కాకపోయినా, కనీసం మహిళలుగా మాట్లాడాలని హితవు పలికారు. కురవి మండల కేంద్రంలోని శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ లగచర్లలో భూ సేకరణపై ప్రభుత్వం వెనక్కి తగ్గడం గిరిజన రైతుల విజయమని, మానుకోటలో నిర్వహించిన మహాధర్నా కీలకంగా మారిందన్నారు. సర్వసతి నిలయాలుగా ఉన్న గురుకులాలు ప్రస్తుతం పర్యవేక్షణ లేక పడావుపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫుడ్ పాయిజన్ జరగడంలో గురుకులాల సెక్రటరీగా గతంలో పనిచేసిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రమేయం ఉందని సురేఖ అనడం విడ్డూరంగా ఉందన్నారు. నిరాధార ఆరోపణలు మాని బుద్ధిగా పని చేసుకోవాలని హితవు పలికారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలంటే రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. ఇంటి నుంచి తినుభండారాలు తెచ్చుకొనే విద్యార్థులు ఆస్పత్రి పాలయ్యారని ఒక మంత్రి మాట్లాడితే, మరో మంత్రి నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు. మంత్రి సీతక్క ఒక్క పాఠశాలనైనా తనిఖీ చేశారా? అంటూ ప్రశ్నించారు. అసమర్థ కాంగ్రెస్ పాలనలో అమాయక విద్యార్థులు బలవుతున్నారన్నారు. కురవి గురుకులం సమస్యలు వివరిద్దామని ఆర్సీవోకు ఫోన్ చేస్తే కనీస స్పందన లేదన్నారు. ఏడాది గడుస్తున్నా కాంగ్రెస్ పాలకులు బీఆర్ఎస్ జపమే చేస్తున్నారని, వారి తప్పులు కప్పిపుచ్చుకునేందుకు బీఆర్ఎస్‌పై ఆరోపణలు చేస్తున్నారని సత్యవతి విమర్శించారు. సమావేశంలో నాయకులు నరహరిగౌడ్, బాదె నాగయ్య, బోడ శ్రీను, నెహ్రూనాయక్, అల్లూరి కిషోర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కన్నా మీటింగే ముఖ్యమా?

- మానుకోట కలెక్టర్‌ది బాధ్యతా రాహిత్యం
- ఎమ్మెల్సీ రవీందర్‌రావు మండిపాటు

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 30 : రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలోని విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో అవస్థలు పడుతుంటే, మానుకోట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు కలెక్టర్ రాకపోవడం సరైంది కాదని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు మండిపడ్డారు. జిల్లాలోని 18 మండలాలకు చెందిన విద్యార్థులకు ఒకేచోట నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్‌కు కలెక్టర్ హాజరుకాకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. శనివారం పట్టణంలోని అనంతారం ఆదర్శ పాఠశాలలో డీఈవో రవీందర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీలు సత్యవతి, రవీందర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నిరంతరం ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లను పర్యవేక్షించి విద్యార్థులకు ధైర్యాన్ని కల్పించాల్సిన కలెక్టర్ ఎగ్జిబిషన్‌కు రాకుండా మహబూబ్‌నగర్‌లో నిర్వహించే ప్రభుత్వ విజయోత్సవానికి వెళ్లడం, అధికారులతో సమీక్షలు చేయడం సరైంది కాదన్నారు. బీఆర్ఎస్ నాయకులు ప్రతిరోజు హాస్టల్స్‌ను సందర్శించి రుచికరమైన భోజనం అందించేలా పోరాటం చేస్తారన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు

పట్టుకున్న గంజాయిని గుట్టుగా సరఫరా చేసిన కానిస్టేబుల్

- స్వాధీనం చేసుకున్న దానిలో సగం మార్కెట్‌లోకి
- సరఫరాదారులకు అమ్మిన ఖాకీలు
- గంజాయి కేసులో పెద్ద ట్విస్ట్
- అప్పటి ఎస్సై, సీఐలపై ఆరోపణలు

పోలీస్ వారి దొంగ బుద్ధి..!

గంజాయి మత్తు యువతను చిత్తు చేస్తున్నది. పెద్దలే కాదు విద్యార్థులు, మైనర్లూ దీనికి బానిసై పెడదోవ పడుతుంటే అడ్డుకట్ట వేయాల్సిన పోలీసులే.. దొంగ దారిలో సరుకును సరఫరా చేయడం విస్తుగొల్పుతోంది. రాష్ట్రాలు దాటి నగరానికి చేరి సగటున రోజుకో చోట పట్టుబడుతున్నా కళ్లెం వేయాల్సిన ఖాకీలే సరఫరాదారులకు అమ్మిన తీరు విమర్శలకు తావిస్తోంది. వరంగల్ కమిషనరేట్ పరిధిలోని పెంచికల్‌పేట వద్ద గతంలో తనిఖీల్లో పట్టుబడిన 300 కిలోల గంజాయిలో నుంచి 2 కిలోల సరుకును ఎల్కతుర్తి స్టేషన్ కానిస్టేబుల్ రవి మాయం చేసి తన అల్లుడి ద్వారా నర్సంపేటలో కళాశాల విద్యార్థులకు విక్రయించడం, ఇటీవల తనిఖీల్లో అది పట్టుబడడంతో ఈ గంజాయి దందా విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో సీరియస్‌గా తీసుకున్న ఉన్నతాధికారులు రవి ఇంట్లో కూడా కొంత గంజాయిని స్వాధీనం చేసుకొని శుక్రవారం రిమాండ్‌కు తరలించగా, సీజ్ చేసిన గంజాయిని కానిస్టేబుల్ ఒక్కడే తీశాడా? అతడికి ఇంకా ఎవరెవరు సహకరించారా? అందులో అప్పుడు పనిచేసిన సీఐ, ఎస్సైల పాత్ర ఏమైనా ఉందా? అనేది తేలాల్సి ఉంది. దొంగల ఆటకట్టించే పోలీసుల్లోనే ఇలా కొందరు దొంగ బుద్ధి చూపడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తుండగా పోలీసు శాఖలో పెద్ద దుమారం రేపుతోంది.

- వరంగల్, నవంబర్ 30(నమస్తే తెలంగాణ ప్రతినిధి)

ఎల్కతుర్తి పోలీస్‌స్టేషన్‌లో అంగోత్ రవి 2022 నుంచి కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. వరంగల్-కరీంనగర్ నేషనల్ హైవేపై పోలీసులు గతంలో తనిఖీలు చేస్తుండగా పెంచికల్‌పేట వద్ద 300 కిలోల గంజాయి పట్టుపడింది. పోలీసులు ఆ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేశారు. పట్టుపడిన గంజాయిలో నుంచి 6 కిలోల సరుకును కోర్టులో శాంపిల్‌గా సమర్పించే పనిని కానిస్టేబుల్‌కు అప్పగించినట్లు తెలిసింది. మార్కెట్‌లో డిమాండ్ ఉండే గంజాయి వ్యాపారం చేయాలనే ఆలోచన మొదలైంది. రవికి వరుసకు అల్లుడు అయ్యే మనోహర్ 2 కిలోల గంజాయిని తీసుకుని వెళ్లి నర్సంపేట ప్రాంతంలోని ఓ కాలేజీ విద్యార్థులకు విక్రయించాడు. అక్కడ పోలీసులకు పట్టుబడ్డాడు. అక్కడి పోలీసులు గట్టిగా విచారించడంతో ఎల్కతుర్తి పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ రవి దగ్గర నుంచి తీసుకున్నట్లు మనోహర్ అంగీకరించాడు. అనంతరం పోలీసులు వరంగల్ నగరం గోపాల్‌పూర్‌లోని కానిస్టేబుల్ రవి ఇంట్లో తనిఖీలు చేశారు. అక్కడ కొద్దిగా గంజాయి పట్టుపడినట్లు తెలిసింది. నర్సంపేట పోలీసులు కోర్టు కానిస్టేబుల్ రవిపై కేసు నమోదు చేసి శుక్రవారం రిమాండ్ చేసినట్లు తెలిసింది. కానిస్టేబుల్ రవి గంజాయిని ఎలా తీసుకువెళ్లాడు, ఈయనకు సహకరించిన పోలీస్ అధికారులు ఎవరనేది ఇప్పుడు ఆసక్తిగా మారింది.

ఎల్కతుర్తి పోలీస్‌స్టేషన్‌లో రవి రైటర్‌గా పనిచేస్తున్న సమయంలో ఓ కేసులో పట్టుకున్న గంజాయిని కోర్టులో డిపాజిట్ చూపించిన తర్వాత వరంగల్ పోలీస్ కమినరేట్ కార్యాలయంలో మాల్‌ఖానా(గది పేరు)లో భద్రపరుస్తారు. పోలీస్‌స్టేషన్ల వారీగా డిస్పోజల్ కమిటీ ఉంటుంది. పది నుంచి 20కేసుల్లో పట్టుబడిన గంజాయిని మాల్‌ఖానా నుంచి ఏరియా డిస్పోజల్ కమి టీ ద్వారా జోన్ వారీగా ఎంపిక చేసి కాజీపేట మండలం అమ్మవారిపేటలోని కాకతీయ మెడిక్లిన్ సర్వీస్ బాయిలర్‌లో దహనం చేస్తారు. ఎల్కతుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుకున్న గంజాయిని మాల్‌ఖానా నుంచి అమ్మవారిపేటకు దహనానికి తీసుకెళ్తున్న క్రమంలో కొంత సరుకును తీసి అమ్ముకున్నట్లు నార్కోటిక్ పోలీసులకు కానిస్టేబుల్ రవి వాంగ్మూలంలో చెప్పినట్లు తెలిసింది. నిజంగా ఇలాగే జరిగిందా? పోలీస్‌స్టేషన్ నుంచే గంజాయి మాయమైందా? అనేది అనునాస్పదంగా ఉన్నది. గంజాయి కేసు పోలీసు శాఖకు అప్రతిష్ట తెచ్చే పరిస్థితి ఉండడంతో ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నారు. ఎల్కతుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి ఎప్పుడెప్పుడు పట్టుబడింది? ఆ సమయంలో అక్కడ పనిచేసిన ఎస్సైలు ఇన్‌స్పెక్టర్లు ఎవరనేది ఆరా తీస్తున్నారు. గంజాయి కేసుల పూర్వాపరాలను పరిశీలిస్తున్నారు. పోలీస్‌స్టేషన్లలోని ఉన్నతాధికారుల ప్రమేయం లేనిదే కిందిస్థాయి ఉద్యోగి ఇలా చేయకపోవచ్చనే కోణంలో విచారణ చేసేందుకు సిద్ధమవుతున్నారు. గంజాయిని నియంత్రించాల్సిన పోలీసులే మార్కెట్‌లో సరఫరాకు కారకులుగా మారడంపై పోలీసు శాఖపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

'పోలీస్ యూనిఫాం'ను గర్వంగా భావించాలి

కొత్త కానిస్టేబుళ్లతో సీపీ అంబర్ కిశోర్ ఝా

సుబేదారి, నవంబర్ 30 : పోలీసు యూనిఫాం ధరించినందుకు గర్వపడాలని వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా అన్నారు. కమిషనరేట్‌కు అలాట్ అయిన 578 మంది నూతన పోలీసు కానిస్టేబుళ్లతో సీపీ శనివారం హనుమకొండలోని తన కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు నేరుగా సేవలు అందించే అవకాశం ఒక్క పోలీసులకు మాత్రమే ఉంటుందన్నారు. అంకితభావంతో పనిచేసి ప్రజలకు తాము ఉన్నామనే భరోసా కల్పించాలన్నారు. విధి నిర్వహణలో ఎన్నో ఒత్తిళ్లు ఉంటాయని.. ఓర్పు, సహనంతో పని చేయాలని సూచించారు. శాఖాపరమైన సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాల న్నారు. సమావేశంలో అదనపు డీసీపీలు రవి, సురేశ్‌కుమార్, ఏవో రామకృష్ణ, ఏసీపీ అనంతయ్య, ఆర్ఐలు సర్జన్‌రాజ్, శ్రీనివాస్, శ్రీధర్ పాల్గొన్నారు. కాగా, వరంగల్ కమిషనరేట్‌కు అలాట్ అయిన 578 మంది కానిస్టేబుళ్లలో 376 మంది సివిల్, మిగతా 211మంది ఆర్మ్‌డ్ రిజర్వు సిబ్బంది ఉన్నారు. సివిల్ కానిస్టేబుళ్లను కమిషనరేట్ పరిధిలోని సెంట్రల్ జోన్‌కు 145 మంది, వెస్ట్‌జోన్‌కు 119 మంది, ఈస్ట్ జోన్‌కు 68 మంది, మరో ఐదుగురు ఇతర విభాగాలకు కేటాయించారు.

కొత్త కానిస్టేబుళ్ల సమావేశంలో మాట్లాడుతున్న సీపీ

రైల్వేస్టేషన్ ఎదుట విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్

బీఆర్ఎస్ వల్లే కోచ్ ఫ్యాక్టరీ

- గల్లీ నుంచి ఢిల్లీ వరకు పోరాడిన ఫలితం
- ఇందులో కాంగ్రెస్ చేసిందేమీ లేదు
- సమైక్య రాష్ట్రంలో తీవ్ర అన్యాయం
- రైల్వే కార్యాలయాలను కాపాడిన ఘనతా మాదే
- స్థానికులకు 60శాతం ఉద్యోగాలివ్వాలి
- కాజీపేట జంక్షన్‌ను రైల్వే డివిజన్‌గా అప్‌గ్రేడ్ చేయాలి
- బోడగుట్టకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి
- బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్

కాజీపేట, నవంబర్ 30 : గల్లీ నుంచి ఢిల్లీ వరకు బీఆర్ఎస్ దశలవారీగా చేసిన పోరాటాల ఫలితంగానే కాజీపేట ఇంటిగ్రేటెడ్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ సాధ్యమైందని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కాజీపేట రైల్వేస్టేషన్ ఎదుట శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి వరంగల్ ప్రాంత ప్రజల 45 ఏండ్ల ఆకాంక్ష మేరకే కోచ్ ఫ్యాక్టరీ మంజూరైందన్నారు. సమైక్య రాష్ట్రంలో కాజీపేటకు తీవ్ర అన్యాయం జరిగిందని, కోచ్ ఫ్యాక్టరీ రావడంలో కాంగ్రెస్ పార్టీ పాత్ర ఏమీలేదన్నారు. నిజాం కాలం నుంచి రైల్వే కార్మికులు, కార్యాలయాలతో కళకళలాడిన కాజీపేట జంక్షన్, కాంగ్రెస్ పాలనలో వెలవెలబోయిందన్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు సమయంలో ఉద్యమ నేత కేసీఆర్ ముందుచూపుతో ఉమ్మడి జిల్లాలో కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారంలో ఉక్కు పరిశ్రమ, ములుగు గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుచేయాలని ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పొందుపరిచేలా చర్యలు తీసుకున్నారని గుర్తుచేశారు. గతంలో కాజీపేట నుంచి తరలిపోతున్న పలు రైల్వే ముఖ్య కార్యాలయాలను కాపాడిన ఘనత బీఆర్ఎస్ పార్టీదేనని తెలిపారు. కాజీపేటలో ఏర్పాటు కానున్న కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకు 60శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అన్ని అర్హతలున్న కాజీపేట జంక్షన్‌కు రైల్వే డివిజన్ హోదాకు వెంటనే అప్‌గ్రేడ్ చేయాలన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కాజీపేట అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేశామని పేర్కొన్నారు. కాజీపేట బోడగుట్టకు ఫుట్ ఓవర్ బ్రిడ్జికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రూ.5 కోట్ల నిధులను కేటాయించి, రైల్వే సహకారంతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు. కాజీపేటకు మంజూరైన కోచ్ ఫ్యాక్టరీనీ తామే తెచ్చామని ప్రజాప్రతినిధులు చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. అనంతరం కాజీపేటలో రైల్వే వ్యాగన్, కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 36 రోజుల రిలే నిరాహార దీక్షలకు కన్వీనర్‌గా వ్యవహరించిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సుంచు కృష్ణను దాస్యం సన్మానించారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై కాజీపేట చౌరస్తాలో బీఆర్ఎస్ శ్రేణులు బాణాసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్, కార్పొరేటర్లు సంక నర్సింగరావు, ఇండ్ల నాగేశ్వర్‌రావు, మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్, బీఆర్ఎస్ నాయకులు నార్లగిరి రమేశ్, బుర్ర జనార్దన్, శిరుమల్ల దశరథం, సుంచు కృష్ణ, పీ.సురేశ్‌కుమార్(కాంట్రాక్టర్), పులి రజనీకాంత్, పాలిపెల్లి రాంమూర్తి, గబ్బెట శ్రీనివాస్, శివకుమార్, కాటాపురం రాజు, మహ్మద్ సోనీ, తేలు సారంగపాణి, బస్వ యాదగిరి, సుంచు అశోక్, దువ్వ కనుకరాజు, రంజిత్‌కుమార్, గ్యాస్ రవి తదితరులు పాల్గొన్నారు.

మన ఇంట్లో ఇలాగే తింటామా?

- ముద్ద అన్నం పిల్లలు ఎలా తింటారు?
- గురుకులాలకు కొత్త బియ్యం పంపిస్తరా..
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి
- శాయంపేట జ్యోతిబాపూలే బాలుర గురుకులం ఆకస్మిక తనిఖీ

వంటలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

శాయంపేట, నవంబర్ 30 : 'మనం ఇంట్లో ఈ తిండి తింటామా? ఇంత ముద్దలా ఉంటే పిల్లలు ఎలా తింటారు? మరుగుదొడ్లకు డోర్లు లేకపోతే ఎలా?' అని శాయంపేట మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకులం ప్రిన్సిపాల్ రేవతిని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ప్రశ్నించారు. 'పిల్లలకు కనీసం ఆరు నెలలు పాత బియ్యం ఇవ్వాల్సింది పోయి కొత్త బియ్యం పంపిస్తరా? ప్రభుత్వానికి చెప్పండి' అంటూ సూచించారు. బీఆర్ఎస్ గురుకుల బాటలో భాగంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి శనివారం హనుమకొండ జిల్లా శాయంపేటలోని జ్యోతిబాపూలే బాలుర గురుకులాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. కొందరు పిల్లలతో మాట్లాడి చదువు, సౌకర్యాలు ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకోవడంతో పాటు పలు రిజిస్టర్లను పరిశీలించారు. మరుగుదొడ్లలో కొన్నింటికి డోర్లు లేకపోవడం, మరికొన్ని విరిగి ఉండటంతో ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించారు. స్టోర్‌రూంకు వెళ్లి కోడిగుడ్లు చిన్న సైజులో ఉండడంపై ఆక్షేపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో గురుకుల స్కూళ్లల్లో ఫుడ్ పాయిజన్స్ జరిగి విద్యార్థులు చనిపోవడం బాధాకరమన్నారు. 7వ తేదీ వరకు బీఆర్ఎస్ గురుకుల బాటలో సమస్యలు తెలుసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తుందన్నారు. 9 నుంచి అసెంబ్లీ సమావేశాలున్నాయని, అందులో ప్రస్తావిస్తామన్నారు. విద్యార్థులకు మంచి భోజనం, మెరుగైన విద్య అందించేందుకు బీఆర్ఎస్ కృషి చేస్తుందన్నారు. గురుకులంలో భోజనం ముద్దగా ఉండడం, మరుగుదొడ్లకు డోర్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మంత్రులు సురేఖ, సీతక్క రాష్ట్రంలో ఫుడ్‌పాయిజన్ విషయంలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బీఆర్ఎస్ హస్తం ఉందని మాట్లాడడం శోచనీయమన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులు హాస్టళ్లను విజిట్ చేసి విద్యార్థులతో మమేకమై, సమస్యలు తెలుసుకోవాలని హితవు పలికారు. అనంతరం మండలంలోని పెద్దకోడెపాక హైస్కూల్‌కు వెళ్లి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులు టిఫిన్ బాక్సులను తెచ్చుకొని తింటుండటంతో పిల్లలతో మాట్లాడారు. నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. గండ్ర వెంట మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ మారెపల్లి నందం, గోవిందాపూర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు దాసి శ్రావణ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ మేకల శ్రీనివాస్, గంటా శ్యాంసుందర్‌రెడ్డి, కొమ్ముల శివ, ఇటుకాల పాపారావు, రంగు ప్రభాకర్, అమ్మ అశోక్, కొడెపాక బాబు, పొడిశెట్టి గణేశ్, మగ్దుం పాషా తదితరులున్నారు.

స్టాఫ్ నర్స్ అనుమానాస్పద మృతి

మృతదేహంతో దవాఖాన ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన

అఫ్సర్ (ఫైల్)

కృష్ణకాలనీ, నవంబర్ 30 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని యోధ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో స్టాఫ్‌నర్సుగా పని చేస్తున్న వివాహిత అనుమానాస్పదంగా శనివారం మృతి చెందింది. కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. భూపాలపల్లి పట్టణంలోని టీ-2 క్వార్టర్స్‌కు చెందిన ఎస్‌కే అఫ్సర్ బీ (28) కొన్నేళ్ల కిందట తన భర్తతో విడిపోయి తల్లిదండ్రుల వద్ద ఉంటున్నది. జీవనోపాధి కోసం ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న యోధ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో స్టాఫ్‌నర్సుగా పనిచేస్తున్నది. రోజు మాదిరిగానే శుక్రవారం రాత్రి 8 గంటలకు విధులకు వెళ్లింది. శనివారం తెల్లవారుజామున ఆసుపత్రి సిబ్బంది ఒకరు